క్లుప్తంగా

మాజీ సీఎంను కలిసిన సర్పంచ్

సీతారామపురం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం సీతారామపురం మండలం గుండుపల్లి సర్పంచ్ చప్పిడి తిరుపతిరెడ్డి ఢిల్లీలో కలిశారు. ఢిల్లీలో బుధవారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టే ధర్నాలో పాల్గొనేందుకు సర్పంచ్ తిరుపతిరెడ్డి ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కలిశారు.

చిన్నారులకు ఆధార్ నమోదు సేవలు

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 27వ తేదీ వరకు ఐదేళ్ల లోపు చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డులు పొందేందుకు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు ఎ.రాఘవేంద్ర తెలిపారు. ఉదయగిరిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు ఆధార్ నమోదు చేశారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గ్రామదేవత పోలేరమ్మకు గ్రామోత్సవం



సంగం: మండలంలోని తలుపూరుపాడు గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత పోలేరమ్మ జాతరలో భాగంగా సోమవారం అర్ధరాత్రి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఇళ్ల ముంగిటకు వచ్చిన అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా అలఘునాథుని కల్యాణం



ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని పురాతన అలఘునాథ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత అలఘునాథస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై వేంచేపు చేశారు. అనంతరం అర్చకులు శ్రీనివాస శర్మ, రామయ్యస్వామి అలఘునాథస్వామి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



మర్రిపాడు: మండలంలోని చుంచులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది 10వ తరగతి ఫలితాల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన కలిశెట్టి జ్ఞాపిక, ఇందూరు లక్ష్మీప్రసన్న, పవన్‌కల్యాణ్, వనం విజితలకు పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రవాస భారతీయుడు చింతంరెడ్డి సుదర్శన్‌రెడ్డి రూ.12 వేల నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు. అలాగే పాఠశాలకు రూ.22 వేల విలువైన ప్రింటర్‌ను అందజేశారు. మంగళవారం ఆ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, విశ్రాంత హెచ్‌ఎం కలిశెట్టి వెంకటరమణయ్య, తంగేడుపల్లి సుబ్బయ్య, మల్లీశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేసీబీతో కాలువ తీయించి..



సాక్షి ఎఫెక్ట్..

వింజమూరు(ఉదయగిరి): వర్షం కురిస్తే వింజమూరులోని బంగ్లాసెంటర్‌లో చాకలికొండ బస్టాండ్ వద్ద ప్రయాణికులు పడుతున్న అవస్థలపై సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'వర్షం పడితే నరకమే' అనే కథనానికి ఎంపీడీఓ కిరణ్‌కుమార్ స్పందించారు. బంగ్లాసెంటర్ వద్ద జేసీబీతో కాలువ తీయించి నీరు బయటకు వెళ్లే ఏర్పాట్లు చేశారు. అలాగే చుట్టుపక్కల ఉన్న మాంసం దుకాణదారులు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల్లో చికెన్ వ్యర్థాలు వేయకూడదని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ సుజన పాల్గొన్నారు.

'ఉపాధి'పై పచ్చ ప్రతాపం

వలసల నివారణే లక్ష్యంగా అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను నిలిపివేసేలా కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇప్పటి వరకు క్షేత్రసహాయకులుగా పనిచేస్తున్న వారిని రాజీనామా చేయాలని, ఆ స్థానంలో తమ వారిని నియమించుకుంటామని చెబుతూ ఎక్కడికక్కడ పనులు నిలిపివేసేలా అధికారులకు హుకుం జారీ చేశారు. దీంతో ఉపాధి పనులు నిలిచిపోయి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సీతారామపురంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- ప్రభుత్వం మారడంతో ఆగిన పనులు
- పనులు లేక ఇబ్బంది పడుతున్న కూలీలు
- క్షేత్రసహాయకులను మార్చే వరకు పనులు ఆపివేసిన తమ్ముళ్లు

ఉదయగిరి: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించి వలసల నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే 45 రోజుల క్రితం రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తెలుగు తమ్ముళ్లు ఉపాధి హామీ పనులను ఆపివేశారు. గతంలో ఉన్న క్షేత్రసహాయకులను తొలగించేంత వరకు పనులు ఆపివేయాలని స్థానికంగా ఉన్న టీడీపీ నేతలు మండల అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో అధికారులు వెంటనే పనులు ఆపివేశారు. గత నెలన్నరగా ఉపాధి పనులు ఆగిపోయాయి. అక్కడక్కడా నామమాత్రంగా పనులు జరుగుతున్నాయి.

ఉదయగిరి నియోజవర్గంలో..

ఉదయగిరి నియోజవర్గంలో 8 మండలాలు ఉండగా.. సుమారు 75 వేల వరకు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఉన్నాయి. గతేడాది నియోజకవర్గంలో ఇదే సీజన్‌లో 20 వేల మంది వరకు ఉపాధి పనులకు హాజరయ్యారు. ఈ ఏడాది మాత్రం 3 వేల మంది లోపే పనులకు హాజరవుతుండడం గమనార్హం. సోమవారం నియోజవర్గ వ్యాప్తంగా ఉపాధి పనులకు హాజరైన కూలీల సంఖ్య కేవలం 2,400 మంది మాత్రమేనని తెలుస్తోంది.

పనులు ఆపిన అధికారులు

ఎన్నికల ఫలితాలు రాక ముందు వరకు ప్రతి రోజూ 20 వేల మంది వరకు కూలీలు ఉపాధి పనులు చేసేవారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండు రోజుల తర్వాత తెలుగు తమ్ముళ్లు ఉపాధి పనులను ఆపు చేయించారు. క్షేత్రసహాయకులను మార్చి తమ పార్టీ వారిని నియమించేవరకు పనులు నిలిపివేయాలని హుకుం జారీ చేశారు. దీంతో అధికారులు ఎక్కడి పనులపే అక్కడ నిలిపివేశారు. ఇలా ఉపాధి పనులను నిలిపివేయడంపై కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి పనులకు కూడా రాజకీయ రంగు దేనికంటూ కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తమ్ముళ్ల రుబాబు



సంగం మండలంలో వ్యవసాయ కాలువలో పూడికతీస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

ఆత్మకూరు: గ్రామాల నుంచి వలసలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక అభాసుపాలవుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లపై తెలుగు తమ్ముళ్లు రుబాబు చేస్తున్నారు. వారికి ఫోన్లు చేసి ఉద్యోగానికి రాజీనామా చేయాలని, తమకు సంబంధించిన వారికి ఆ ఉద్యోగం ఇప్పించుకుంటామని, అది జరిగేంత వరకు పనులు నిలిపివేయాలని ఫోన్లలో బెదిరింపులకు దిగుతున్నారు. ఐదు రోజుల వ్యవధిలో అనంతసాగరం మండలంలో రెండు గ్రామాల్లో, చేజర్ల మండలంలో రెండు గ్రామాల్లో, మర్రిపాడు మండలంలో ఒక గ్రామంలో ఇలాంటి ఫోన్ బెదిరింపు చోటుచేసుకున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. అనంతసాగరంలో పనులకు వెళ్లిన కూలీలతో పనులను నిలిపివేశామని, వెనక్కు వచ్చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఫోన్ చేసి బెదిరించారు. మేము చెప్పే వరకు పనులు జరగవని, ఇంకెక్కడైనా పనులు చూసుకోవాలని బెదిరింపు ధోరణిలో వ్యవహరించారు. దీంతో ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆత్మకూరు మండలానికి 3,08,650 పనిదినాలు, ఏఎస్‌పేట మండలానికి 3,14,020 పనిదినాలు, అనంతసాగరం మండలానికి 3,00,810 పనిదినాలు, చేజర్ల మండలానికి 2,32,251 పనిదినాలు, మర్రిపాడు మండలానికి 1,61,612 పనిదినాలు, సంగం మండలానికి 1,27,250 పనిదినాలు కేటాయించగా టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఉపాధి పనులను నిలిపివేయడం గమనార్హం.

బెదిరింపులు సరికాదు

తెలుగు తమ్ముళ్లు ఉపాధి పనులను అడ్డంపెట్టుకొని కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కూలీలు వాపోతున్నారు. ఉపాధి పనులు నిలిపివేయడంతో తాము మరలా వలసబాట పట్టక తప్పదేమోనని గ్రామాల్లోని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కూలీలకు కేటాయించిన వంద రోజుల పనిదినాలు పూర్తి కావడంతో ఉపాధి పనులు నిలిపివేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పడం గమనార్హం.

వెంటనే ఉపాధి పనులు ప్రారంభించాలి



ప్రభుత్వం మారిన తర్వాత ఉపాధి పనులను ఆపుచేశారు. పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం రైతువారీ పనులు కూడా లేవు. కేవలం ఉపాధి పనులపై ఆధారపడి జీవిస్తున్నాం. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. వెంటనే పనులు ప్రారంభించాలి.

– దాయేదు, కొండాయపాళెం

కూలీల సంఖ్య తక్కువగా ఉంది



ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉపాధి కూలీల సంఖ్య తక్కువగా ఉంది. ఏప్రిల్, మే నెలల్లో రోజుకు 28 వేల మంది వరకు కూలీలు పనిచేశారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. కూలీలందరూ పనులకు హాజరయ్యేలా చూస్తాం.

– గాయత్రీదేవి, ఏపీడీ, ఉదయగిరి

ఉపాధి పనులే జీవనాధారం



గ్రామాల్లో ఉపాధి పనులే మాకు జీవనాధారం. కొందరు ఉపాధి పనులను నిలిపివేయాలని కోరడం బాధాకరం. అధికారులు మా పరిస్థితి అర్థం చేసుకోవాలి. ఉపాధి పనులను పునరుద్ధరించి ఆదుకోవాలి.

– డి.సుబ్బరాయుడు, ఉపాధి కూలీ, డీసీ పల్లి, మర్రిపాడు మండలం

పనులు నిలిపివేయడం బాధాకరం



ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇటీవల ఉపాధి పనులు నిలిపివేయాలని అధికారులు చెప్పడం బాధాకరం. అధికారులు గ్రామాల్లో కూలీల పరిస్థితిని పరిశీలించి వలసలు జరగకముందే ఉపాధి పనులు ప్రారంభించాలి.

– షేక్ మీరావలి, ఉపాధి కూలీ, మహిమలూరు, ఆత్మకూరు మండలం

అనుమతులు లేని లేఅవుట్లపై కొరడా



లేఅవుట్‌లో నోటీసు బోర్డు ఏర్పాటు చేసిన పంచాయతీ అధికారులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 348–2–ఏలో ఉన్న 5.67 ఎకరాల హరిత లేఅవుట్ పంచాయతీ అనుమతి లేకుండా ఏర్పాటు చేసినందున అదే గ్రామానికి చెందిన దేవత మాల్యాద్రి ఫిర్యాదు మేరకు లేఅవుట్‌లోని రాళ్లను అధికారులు మంగళవారం తొలగించి నోటీసు బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ అనుమతులు లేని అనధికార లేఅవుట్‌లలో క్రయవిక్రయాలు నిషేధమని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొన్న వినియోగదారులు నష్టపోతారని పేర్కొన్నారు.

జల్‌జీవన్ మిషన్‌పై గ్రామసభలు



గణేశ్వరపురంలో మాట్లాడుతున్న సర్పంచ్ తిరుపాలు

ఉదయగిరి: మండలంలోని జి.చెరువుపల్లి, బండగానిపల్లి గ్రామాల్లో మంగళవారం జల్‌జీవన్ మిషన్‌పై గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈఓపీఆర్డీ మల్లికార్జున, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరికుంటపాడు మండలంలో..

గణేశ్వరపురం, పెద్దిరెడ్డిపల్లి, జడదేవి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు.ఆయా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు, నీటి సరఫరా తదితర అంశాలపై చర్చించారు.

విద్యుత్ బకాయిలపై దృష్టి పెట్టండి

- ట్రాన్స్‌కో ఈఈ జనార్దన్



వరికుంటపాడులో సిబ్బందితో మాట్లాడుతున్న ఈఈ జనార్దన్

ఉదయగిరి: వ్యవసాయ, గృహ విద్యుత్ బిల్లులను వినియోగదారులు సకాలంలో చెల్లించేలా తగిన చర్యలు తీసుకొని, డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన కల్పించాలని ఆత్మకూరు ఈఈ జనార్దన్ పేర్కొన్నారు. విద్యుత్ బకాయిల వసూలు, డిజిటల్ పేమెంట్స్‌పై ఆయన మంగళవారం వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి విద్యుత్ సబ్ స్టేషన్లలో సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. మండలం వారీగా వసూలు కావాల్సిన విద్యుత్ బిల్లుల మొత్తం నగదు, బకాయిలు ఎంత ఉన్నాయనే దానిపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేయాలని, గ్రామాల్లో గృహ విద్యుత్ వినియోగదారులకు డిజిటల్ చెల్లింపులపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశాల్లో ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఉదయగిరి: సమావేశం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



ఆత్మకూరు : మాట్లాడుతున్న డాక్టర్ షేక్ అస్మా

ఉదయగిరి: ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు రకాల వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారిణి ఎం.శివకల్పన సూచించారు. మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించి దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక పంచాయతీ పాలకవర్గంతో కలిసి వీధుల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కె.వెంకటసుబ్బయ్య, సీహెచ్‌ఓ శివకుమారి పాల్గొన్నారు.

ఆత్మకూరు: వర్షాకాలం ప్రారంభమైన క్రమంలో డెంగీ, డయేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆత్మకూరు యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ షేక్ అస్మా సూచించారు. ఆత్మకూరులోని యూపీహెచ్‌సీలో మంగళవారం ఆమె సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, పాత టైర్లు, కొబ్బరి చిప్పల్లో నిల్వ నీటిని తొలగించేలా చూడాలని సూచించారు. దోమల ద్వారా డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓలు సుధాకర్, పార్వతమ్మ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

మర్రిపాడు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మర్రిపాడు మండల శాఖ పరిధిలో ఖాతాదారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుందని ఆ బ్యాంక్ మేనేజర్ చింతమనేని జనార్దన్‌రావు పేర్కొన్నారు. ఆయన మంగళవారం మర్రిపాడులోని ఆ బ్యాంక్‌లో మాట్లాడుతూ బ్యాంకులో రుణాలు తీసుకున్న ఖాతాదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు.

పంటల పరిశీలన

సోమశిల: అనంతసాగరం మండలంలోని బొమ్మవరం అగ్రహారం, చిలకలమర్రి గ్రామాల్లోని మెట్ట పైర్లను మంగళవారం ఏఓ శ్రీనివాస్ చక్రవర్తి పరిశీలించారు. సాగులో ఉన్న మినుము, వేరుశనగ పైర్లను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్

సీతారామపురం: గ్రామాల్లోని ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరిగా నిర్మించుకొని వాటిని వినియోగించాలని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ సూచించారు. ఆయన బుధవారం సీతారామపురం బిట్–1, 2 సచివాలయాల్లో సర్పంచ్ కె.భాగ్యకుమారి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి సౌకర్యం కల్పిస్తున్నందున కుళాయి కనెక్షన్ అవసరమైన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భార్గవిరెడ్డి, పీఆర్ ఏఈ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

సీతారామపురం: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు సీతారామపురంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఎంఈఓ మస్తాన్‌వలిలకు వినతిపత్రాలు అందించారు. నాయకులు బోగ్యం శ్రీనివాసులు, గొడ్డవేటి వెంకటేశ్వర్లు, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మయ్య, ఆనందీశ్వరయ్య, కొండయ్య, ప్రసాద్, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను పాఠశాలల్లో చేర్పించండి

- డీఈఓ రామారావు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

అనుమసముద్రంపేట: డ్రాపౌట్స్‌ను పాఠశాలలో చేర్పించడమే కాక విద్యార్థులెవరూ గైర్హాజరు కాకుండా చూసుకోవాలని, బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని డీఈఓ రామారావు సూచించారు. మంగళవారం ఆయన ఏఎస్‌పేట, గుంపర్లపాడులలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి పాఠశాలల్లో జరుగుతున్న శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన పిల్లలకు రెమెడియల్ తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ఆహార పదార్థాలను రుచి చూశారు. ఆయన వెంట ఎంఈఓ–2 సాయికుమార్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

పాఠశాల పరిశీలన

సంగం: మండలంలోని పడమటిపాళెం మెయిన్ పాఠశాలను మంగళవారం డీఈఓ పీవీజే రామారావు సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి, ఎంఈఓ మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏపీసీ ఉషారాణి

సీతారామపురం: బడిబయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేలా చూడాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి సూచించారు. ఆమె మంగళవారం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. నోటుపుస్తకాలు, యూనిఫాం, షూలు వంటివి అందరికీ అందాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎంఆర్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట జిల్లా జీసీడీఓ మమత, ఎంఈఓ మస్తాన్‌వలి, సీఆర్‌ఎంటీలు, ఎంఐఎస్‌లు ఉన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

అల్లూరు: మండల పరిధిలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ జ్యోతి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 24వ తేదీ గోగులపల్లి, 25న ఇందుపూరు, 26న పురిణి, 27న బీరంగుంట గ్రామాల్లోని సచివాలయాల్లో 5 నుంచి 15 సంవత్సరాల వారికి ఆధార్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ దుర్గేశ్వర్‌రావు, నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్, ఈఓపీఆర్డీ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాల పంపిణీ



కొండాపురం: బాధితులకు పరికరాలు అందజేసిన డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

కొండాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మంగళవారం పరిశీలించారు. వైద్యసిబ్బంది ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఫ్లోరోసిస్ బాధితులైన 45 మందికి వారి శారీరక వైకల్యాలను అనుసరించి రోజు వారీ పనులకు ఉపయోగపడేలా వాకర్, లుంబర్ బెల్టు, చైర్స్, వాకింగ్ స్టిక్స్ తదితర పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్లోరోసిస్ నివారణ అధికారి డాక్టర్ దివ్య, వైద్యాధికారి నసురుద్దీన్, సీహెచ్‌ఓ చెంచురామయ్య, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మంగళవారం సందర్శించారు. ఆయన వెంట జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారి దివ్య, వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.

చెరువులో చెట్లకు వేలం నిర్వహించండి

ఆత్మకూరు: పట్టణంలోని రాయలకాలం నాటి మేజర్ చెరువులో నల్లతుమ్మ చెట్లు పెరిగి ఉన్నాయని, వాటికి వేలం నిర్వహించి తద్వారా నీటి నిల్వ చెరువులో పెరిగేలా చూడాలని డివిజన్ అటవీశాఖ అధికారి శేఖర్‌ను ఏపీ రైతు, కౌలు రైతుల సంఘం నాయకులు కోరారు. మంగళవారం ఆత్మకూరులోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. త్వరలోనే పరిశీలించి వేలం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ అధికారి శేఖర్ తెలిపారు.